క్లుప్తంగా

విద్యుత్ పొదుపు పాటించాలి



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ఏలూరు నగరంలోని వివిధ పాఠశాలల నుంచి 217 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈపీడీసీఎల్ డీఈ టెక్నికల్ ఎం ఝాన్సీ మాట్లాడుతూ రేపటి తరానికి తగిన విద్యుత్ అందించేందుకు నేటి పౌరులు పొదుపు పాటించాల్సిన అవసరం ఉందని, ఇది విద్యార్థి దశ నుంచే అవగాహన ఏర్పడాలని అన్నారు. అనంతరం విద్యార్థులు, ఉద్యోగులతో ఆమె ఇంధన పొదుపుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఈఈ జేపీవీ నటరాజన్, విజిలెన్స్ సీఐ వి.రవి కుమార్, ఓసీ ఉద్యోగుల సంఘం నాయకులు తురగా రామకృష్ణ, సీహెచ్ సాయి బాబా, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా

ఉపాధి మేట్లకు శిక్షణ



శిక్షణ తరగతిలో పాల్గొన్న మేట్లు

ఏలూరు రూరల్: ఉపాధి హామీ పథకంలో వస్తోన్న మార్పులపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ బి.ప్రణవి అన్నారు. శుక్రవారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం మేట్లకు శిక్షణ ఇచ్చారు. రోజూ పనికి వచ్చే కూలీలకు తప్పనిసరిగా హాజరు వేయాలని, పథకం నిబంధనలు అనుసరించి పనుల కొలతలు చేపట్టాలని ప్రణవి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకం నిధులు పక్కాగా ఖర్చు చేసేందుకు ఎప్పటికప్పుడు విధి, విధానాలు మార్పు తెస్తుందని తెలిపారు. ఏపీడీతో పాటు ఏలూరు, భీమడోలు ఏపీఓ పాల్గొన్నారు.

నేటి నుంచి షష్ఠి మహోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పోస్టల్ కాలనీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నేటి నుంచి స్వామి వారి 23వ శాంతి కల్యాణ మహోత్సవాలు, షష్ఠి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. తొలి రోజు శనివారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అఖండ దీక్షాధారణ, వాస్తు హోమం, మండపారాధన పూజలు చేస్తారు. 17న నిత్య హోమం, నీరాజన మంత్రపుష్పాలు, 18న స్వామి మూలమూర్తులకు అభిషేకం, సాయంత్రం కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 19న స్వామి వారికి అభిషేకాలు, 20న నిత్య హోమం బలిహరణ పూజలు, 21న ముగింపు సందర్భంగా అభిషేకం, కలశోద్వాసన, రాత్రి స్వామి వారికి పవళింపు సేవ చేస్తారు.

వైఎస్సార్ సీపీకే అఖండ విజయం

పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెదబాబు



9వ డివిజన్‌లో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెదబాబు



20వ డివిజన్‌లో సంక్షేమ బోర్డు ప్రారంభించిన డిప్యూటీ మేయర్లు శ్రీనివాస్, సుధీర్‌బాబు

ఏలూరు టౌన్: రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధిస్తుందని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రెట్టింపు సంక్షేమ పథకాలు అమలవుతాయని ఏలూరు కోఆప్షన్ సభ్యులు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. ఏలూరు వన్‌టౌన్ 58వ సచివాలయం పరిధిలో 9వ డివిజన్ ఫిలాస్‌పేట ప్రాంతంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ సబ్బన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్నే మా నమ్మకం – వార్డుకు పోదాం కార్యక్రమంలో క్లస్టర్–1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్ మోటమర్రి సదానందం, రాష్ట్ర హిస్టరీ అకాడమి డైరెక్టర్ ఎండీ ఖైసర్ తదితరులు పార్టీ జెండాను ఎగురవేశారు. డివిజన్‌లో సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేసి చూపించారని తెలిపారు. పేద, మధ్యతరగతి వర్గాల కుటుంబాలకు అండగా నిలుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నారని వివరించారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని హయాంలో నాలుగేళ్ల ఎనిమిది నెలల కాలంలో నగరాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో 32 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడమే కాకుండా సొంతిల్లు కట్టించి ఇచ్చే బాధ్యత ఎమ్మెల్యే నాని తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల వివరాలతో కూడిన జాబితాను బహిరంగంగా ప్రదర్శించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లంకలపల్లి గణేష్, దేవరకొండ నాగేశ్వరరావు, మంగమ్మ, పట్నాల విజయ్, కార్పొరేషన్ మేనేజర్ పి.భాస్కర్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఎన్‌ఆర్‌పేట ఎస్‌బీఐ సమీపంలో..

వై ఏపీ నీడ్స్‌జగన్ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ నాయకులు జీహెచ్‌డీ ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. సంక్షేమ బోర్డును ప్రదర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు ఉన్నారు.

హోంమంత్రిని కలిసిన ఎస్సీ నాయకులు



హోంమంత్రి వనితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్సీ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు విచ్చేసిన హోం మంత్రి తానేటి వనితను పలువురు ఎస్సీ నాయకులు శుక్రవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ నాయకులు పొలిమేర హరికృష్ణ మాట్లాడుతూ హోంమంత్రి వనిత భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. హోంమంత్రిపై బురద చల్లే కార్యక్రమాలను ఆయన ఖండించారు. తామంతా హోంమంత్రి వనిత వెంటే ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి బాబూరావు,ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి సంతాపం



ఎమ్మెల్సీ సాబ్జీతో కుటుంబ సభ్యులు (ఫైల్)

ఏలూరు టౌన్: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి పట్ల ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు పెదబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, కార్మిక వర్గాల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేసే నాయకులు సాబ్జీ మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

పార్టీలు, సంఘాల సంతాపం

ఏలూరు (టూటౌన్): ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి పలు రాజకీయ పార్టీలు, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు వేర్వేరు ప్రకటనల్లో తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. వీరిలో సీపీఎం, బీజేపీ, సీపీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ, విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, ఐఎన్టీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం, ఐఎఫ్‌టీయూసీ, మానవత సంఘాల నాయకులు ఉన్నారు.

తీరని లోటు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి ప్రధానోపాధ్యాయుల సంఘం, ఏపీటీఎఫ్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్య సంఘం, పీఆర్‌టీయూ, సాహిత్య మండలి, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, బహుజన టీచర్స్ అసోసియేషన్, ఏపీయూడబ్ల్యూజేలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు.

యూటీఎఫ్ సంతాపం

ఏలూరు రూరల్: ఎమ్మెల్సీ సాబ్జీ అకాల మృతికి యూటీఎఫ్ ఏలూరు మండల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఉపాధ్యాయ హక్కులపై అలుపెరగని పోరాటం చేశారని పేర్కొన్నారు.

పేదల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం

- రూ.2,800 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- కోలాహలంగా ప్రజా ఆశీర్వాద పాదయాత్ర



అంకన్నగూడెంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, మహిళలు, నాయకులు



పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీచైర్మన్ ఘంటా పద్మశ్రీ

పెదవేగి : పేదల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తోందని, వారి అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అలుపెరగకుండా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. దెందులూరు నియోజకవర్గాన్ని రూ.2,800 కోట్లతో అభివృద్ధి చేశానని ఆయన అన్నారు. మొదటి విడతగా 100 కిలోమీటర్లు, దాదాపు 23 గ్రామాలు పాదయాత్ర చేపట్టిన అబ్బయ్యచౌదరికి అశేష జనవాహిని నడుమ కోలాహలంగా 2వ రోజు కొనసాగింది. శుక్రవారం ఉదయం కొప్పాకలో పల్లె నిద్ర అనంతరం ప్రారంభమైన ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి రెండో రోజు ప్రజా ఆశీర్వాద యాత్రకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కొఠారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొప్పాకలో 100 మందికి జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ

కొప్పాకలో 100 మంది అక్కచెల్లెమ్మలకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి వారి సొంతింటి కలను సాకారం చేశారు. అర్హులైన మిగతా వారికి ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కొప్పాక ఉన్నత పాఠశాలను సందర్శించి, నాడు–నేడు పనులను పరిశీలించి, ఆడుదాం– ఆంధ్రా నేపథ్యంలో కొప్పాక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు అందజేసిన ఎమ్మెల్యే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రజా ఆశీర్వాద యాత్ర కొప్పాక నుంచి అంకన్నగూడెం చేరింది. కొప్పాక సచివాలయంలో మధ్యాహ్న భోజన చేసిన అనంతరం ఎమ్మెల్యే తిరిగి ప్రజా ఆశీర్వాద యాత్రను ప్రారంభించారు. కొప్పాకగూడెం, బి శింగవరం, ప్రధాన రహదారికి అబ్బయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. బి శింగవరం నుంచి ప్రకాష్‌నగర్ బస ప్రాంతానికి అభిమానులు, నాయకులు, కార్యకర్తల తరలి వచ్చారు. ఎమ్మెల్యే గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా మీ అందరికీ ఆశీర్వాదంతో నియోజకవర్గంలో దాదాపుగా రూ.2,800 కోట్ల నిధులు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చు చేసినట్టు తెలిపారు. రాబోయే ఎన్నికలు పేదవారికి పెత్తందారులకి జరగబోయే యుద్ధమని, వైఎస్సార్ సీపీ జెండా ఎప్పుడు పేదవారితోనే ఉంటుందని వివరించారు. చింతమనే హయాంలో ఒక్క సెంటు స్థలం కొని పేదవారికి ఇవ్వలేకపోయారని విమర్శించారు. మొదటి విడతగా నాలుగున్నర ఎకరాల పొలం కొని 118 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని అబ్బయ్యచౌదరి అన్నారు. మీకు మేలు జరిగితేనే వైఎస్సార్ సీపీకి 2024లో ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గ ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

ఏలూరు(మెట్రో) : లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టానికి సంబంధించి ఏర్పాటుచేసిన సమావేశానికి ఆర్డీఓ అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో స్కానింగ్ మిషన్‌ల నిర్వాహకులు లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ వారు విధిగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. డాక్టర్ అనుమతి లేకుండా గర్భస్రావ మందులు అమ్మితే ఆ షాపుల యజమానులపై చర్యలు తీసుకొంటామని తెలిపారు. జిల్లాలోని ఆరోగ్య సిబ్బంది ద్వారా విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని, స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలను, డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని ఆదేశించారు. ఆడ, మగ ఇద్దరూ సమానమనే అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి నాగేశ్వరరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీతారామారావు, పీసీ, పీఎన్ డీటీ లీగల్ కన్సల్టెంట్ వి.సత్యరవి, డిప్యూటీ డెమో డి.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	64	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	70	చామదుంపలు	50
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	10-12
బెండకాయలు	60	కంద	56
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	40
కాకర కాయలు	50	కీర దోస	40
బీరకాయలు	50	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	68	అల్లం	120
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40-50	పాలకూర	12
దొండకాయలు	58	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	40-50	గోంగూర	08
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	36-50	బఠాణి	--
ఆనబకాయ (1)	30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	34

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	11
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	07
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	07
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్‌ఈఎల్	22.15	34820	20
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు –తిరుపతి	16.00	4830	36

అమరజీవికి ఘన నివాళి



కలక్టరేట్‌లో అమరజీవికి నివాళులర్పిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు

ఏలూరు(మెట్రో): ఆంధ్రరాష్ట్ర సాధనకు అమరుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సభ ఏలూరు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకటేశ్వర్లు బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్‌వీ నాగరాణి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్ పుష్పలతతో కలిసి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ శ్రీరాములు చేసిన పోరాటం నిరుపమానమైనదన్నారు. గాంధేయ మార్గంలో 56 రోజులపాటు నిరాహార దీక్ష చేసి అమరులయ్యారని గుర్తుచేశారు. వారి ప్రాణత్యాగాన్ని తెలుగుజాతి ఎన్నటికీ మరువదని అన్నారు. ఆయన ఆశయాలు తెలుగువారందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ ఆఫీసర్స్ ఎస్‌టీఓ జి.గణేష్‌బాబు, బి.సాంబ శివరావు, డీఈఓ ఎం.మురళీకృష్ణ, బీసీ హాస్టల్ వార్డెన్స్, బీసీ వెల్ఫేర్ సిబ్బంది, కలెక్టరేట్ కార్యాలయం సిబ్బంది పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు.

కొనసాగిన ఆశల ఆందోళన

ఏలూరు (టూటౌన్): సమస్యలు పరిష్కారం కోసం ఆశ వర్కర్లు చేపట్టిన 36 గంటల ఆందోళన రెండో రోజు శుక్రవారం కొనసాగింది. కార్యక్రమంలో ఏపీ ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోసమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్‌లు పాల్గొని మాట్లాడారు.

భీమడోలు నుంచి శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్ర

భీమడోలు: భీమడోలులోని శివమాలధారులు శ్రీశైల క్షేత్రానికి శుక్రవారం పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. భీమడోలులోని పార్వతీసమేత భీమేశ్వర స్వామి శివస్వాముల పీఠానికి చెందిన నలుగురు శివస్వామి మాలధారులు సుంకర నారాయణ, మరీదు నాగసురేష్, యడ్ల నాగవెంకట దుర్గా ప్రసాద్, మేడిశెట్టి బాలాజీ 400 కిలోమీటర్ల దూరంగా ఉన్న శ్రీశైలం క్షేత్రానికి పయనమై వెళ్లారు. వారు తొలుత ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఊరేగింపుగా మాలధారులు బయలుదేరి వెళ్లారు. తొలుత అర్చకులు, గురుస్వాములను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఠం గురుస్వామి పేరాబత్తుల వెంకటేశ్వరరావు, బాదర్వాడ కృష్ణమోహనరాజు, అర్చకులు కాళ్లకూరి ఉమాశంకరశర్మ, గుండుగొలను అర్చకులు శివ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రంజనీ, నిర్మలతో కోచ్ కృష్ణకుమారి

భీమడోలు: పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల స్పోర్ట్స్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు పరుగు పందెంలో ప్రతిభను చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 గేమ్స్ మహిళా విభాగంలో గుంటూరు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వి.రంజిని, బి.నిర్మలలు పరుగు పందెం పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వి.రంజిని 400 మీటర్లు, 200 మీటర్లు, 400 రిలే పరుగులో బంగారు పతకాలు సాధించిందన్నారు. బి.నిర్మల 400 మీటర్లు, 400 రిలే పరుగులో వెండి పతకాన్ని సొంతం చేసుకుని సత్తా చాటింది. ఈ ఇద్దరు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారికి ప్రశంసా పత్రాలను, పతకాలను అందించారు. ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలో పోటీలు నిర్వహించనున్నట్టు కోచ్ కృష్ణకుమారి శుక్రవారం తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన ఇద్దరు క్రీడాకారిణిలను, శిక్షణనిచ్చిన అథ్లెటిక్ కోచ్ జి.కృష్ణవేణిని ప్రిన్సిపల్ వి.వెంకటరమణ, వైస్ ప్రిన్సిపల్ ఎస్.విమల అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో పీఈటీ విద్యార్థుల ప్రతిభ



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ పొందిన పీఈటీ విద్యార్థులు

దెందులూరు: వ్యాయామ విద్య భవిష్యత్తులో ఉజ్వల అభివృద్ధి లభిస్తుందని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నత్తాని యేల్ అన్నారు. వ్యాయామ కళాశాల విద్యార్థులు రాజమండ్రిలో నిర్వహించిన ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి అథ్లెటిక్స్ గేమ్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. 400 మీటర్ల పరుగు పందెంలో ఆర్.అలేఖ్య, రేస్‌వాక్‌లో మౌనిక, త్రోలో అఖిల, షార్ట్‌పుట్‌లో సరోజిని, హైజంప్‌లో భారతి, జావలెన్ త్రోలో జగన్నాథం మొదటి స్థానాల్లో నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుపొందారన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపల్ నత్తానియేలు, అధ్యాపకులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సేవల పునరుద్ధరణ

దెందులూరు: దెందులూరు మండలంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు సేవలు ప్రారంభించామని ఐసీడీఎస్ పెదపాడు సెక్టార్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. దెందులూరు మండలంలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు టీచర్లు, ఆయాలు తాళాలు వేసిన సంగతి విదితమే. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఐదుగురు సచివాలయ సిబ్బందితో ప్రతి సెంటరులో తాళాలు పగులకొట్టి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని యథావిధిగా సిబ్బంది ద్వారా అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం ద్వారా అందించే ఆహారాన్ని అడ్డుకోవడం, తాళాలు వేయడం బాధాకరమన్నారు.

80 శాతం సబ్సిడీపై పెసలు పంపిణీ

దెందులూరు: మండలంలో తుపాను కారణంగా పంట నష్టపోయిన గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై పెసలు అందిస్తోందని మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బాధిత రైతులు ఆయా గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల్లో, దెందులూరులో ఏఓ కార్యాలయంలో సంప్రదించాలని రైతులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.